క్లుప్తంగా

పేదలకు పెరుగన్నం పంపిణీ



ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో పితృ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రహ్మానంద బ్రహ్మాచారి గురుదేవుల శిష్య బృందం ఆర్థిక సహకారంతో అందరి ఆనందం గ్రూప్ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు ఆవరణలో ఆదివారం నిరుపేదలతో పాటు వృద్ధులు, దివ్యాంగులకు పెరుగన్నం అందించారు. కార్యక్రమంలో సీఐఐ మండల ప్రధాన కార్యదర్శి రామిశెట్టి ఆదేశ్వరరావు, గ్రూపు నిర్వాహకులు సోమేపల్లి వీరాంజనేయులు గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆలయాలను శుభ్రపరిచిన ప్రణవపీఠం సేవకులు



పొన్నూరు(చేబ్రోలు): పొన్నూరు పట్టణంలోని సహస్రలింగేశ్వరస్వామి, వీరాంజనేయస్వామి దేవాలయాలను ఏలూరు ప్రణవ పీఠం సేవకులు ఆదివారం శుభ్రపరిచారు. పీఠం వ్యవస్థాపకులు వి.పద్మాకర్ సూచనల మేరకు సభ్యులు ఎన్.వంశీ, భాగ్యశ్రీ బృందం ఆలయాల శుద్ధి కార్యక్రమాన్ని చేపట్టింది. ప్రణవపీఠం సేవకులు మాట్లాడుతూ ప్రతి ఆదివారం ఒక దేవాలయాన్ని తమ సేవకులు శుభ్రపరుస్తున్నట్లు తెలిపారు. ఏడాదిగా సుమారు 60కు పైగా దేవాలయాలను పరిశుభ్రపరిచినట్లు వెల్లడించారు. పరిసర ప్రాంతాల్లోని పిచ్చి మొక్కలను, ముళ్ల పొదలను తొలగించటంతో పాటు బూజు, దుమ్ము ధూళిని దులుపుతున్నట్లు తెలిపారు.

తెలుగు ప్రజలకు సేవలు అందించడమే నాట్స్ లక్ష్యం



పెదనందిపాడు: తెలుగు రాష్ట్రాల్లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం చేస్తున్న సేవా కార్యక్రమాల ద్వారా మంచి పేరు వస్తోందని, తెలుగు ప్రజలకు సేవలు అందించడమే నాట్స్ లక్ష్యమని అధ్యక్షుడు నూతి బాపయ్య చౌదరి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం పెదనందిపాడు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నాట్స్, శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఐజీ ఎ.రవిచంద్ర, కళాశాల యాజమాన్య అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ, ప్రిన్సిపల్ వీర రాఘవయ్య, పీడీ పాతూరి శ్రీనివాస్, శీలం అంకారావు, కాకుమాను నాగేశ్వరరావు, నర్రా బాలకృష్ణ, ముద్దన రాఘవయ్య, నగరాజకుమారి, కుర్రా హరిబాబు, నూతి సుబ్బారావు, శంకర్ కంటి వైద్యశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాజీ బాబా దర్గాలో అన్న సంతర్పణ



పెదకాకాని: బాజీబాబా దర్గాలో భక్తులకు ఆదివారం అన్న సంతర్పణ జరిగింది. పెదకాకాని హజరత్ సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గాకు అమావాస్య రోజున రాష్ట్ర వ్యాప్తంగా వేలాదిగా భక్తులు తరలివస్తుంటారు. దర్గా ప్రాంగణంలోనే నిద్రలు చేసే వారికి స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య సహకారంతో దర్గా ప్రాంగణంలో అన్నసంతర్పణ జరిగింది. బాజీబాబా దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా భోజనం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పెదకాకాని ఎస్ఐ పాదర్తి కోటేశ్వరరావు, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ జాకీర్‌హుస్సేన్, దర్గా సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

యువకులపై కేసు నమోదు

పెద నందిపాడు: మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడు, అతనికి సహకరించిన స్నేహితులపై కేసు నమోదు చేసినట్లు పెదనందిపాడు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. బాలికతో టి.కార్తీక్ అనే వ్యక్తి అసభ్యంగా ప్రవర్తించాడని, అతనికి స్నేహితులు కె.ప్రభాస్, ఎం హరిప్రసాదు సహకరించారని ఆయన చెప్పారు. ఆదివారం రాత్రి బాలిక తల్లి ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గ్రామ స్వరాజ్యం.. కేరాఫ్ సచివాలయం

మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు నడుం బిగించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలను అందించటంలో గ్రామ సచివాలయాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. లబ్ధిదారులు గడప దాటకుండానే ప్రభుత్వ సేవలు పొందుతున్నారంటే దానికి ప్రధాన కారణం సచివాలయ వ్యవస్థే. గత టీడీపీ పాలనలో ప్రభుత్వ సేవలు పొందాలంటే రోజులు, వారాలు, నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితి. ప్రస్తుతం ఈ అగత్యం తప్పిందని ప్రజానీకం హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చేబ్రోలు గ్రామ సచివాలయం

- ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు
- సచివాలయ వ్యవస్థతో నూతన ఒరవడి
- ఇంటికొచ్చి సమస్యల పరిష్కారం..

చేబ్రోలు: ప్రతి 2 వేల జనాభాకు ఒక గ్రామ, వార్డు సచివాలయాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. 10–12 శాఖల అధికారులను నియమించి, ప్రజలకు అవసరమైన సేవలు అందించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేసింది. గ్రామాల్లోనే సేవలు పొందేలా వాటిని తీర్చిదిద్దారు. ఈ వ్యవస్థకు దేశంలో మంచి పేరు ప్రతిష్టలు వచ్చాయి. సచివాలయాలు ప్రజలకు సేవా నిలయాలుగా మారాయి. చేబ్రోలు మండలంలోని 17 గ్రామ సచివాలయాల ద్వారా వివిధ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్నాయి. 81,994 మందికి లబ్ధి చేకూరింది. 1,609మంది నిరుపేదలకు ఇళ్ల స్థలాలను అందించటం జరిగింది.

ప్రజల వద్దకే పరిపాలన

మండలంలో ప్రధానంగా పట్టాదార్ పాస్ పుస్తకాలు, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు, రేషన్ కార్డులు, రిజిస్ట్రేషన్, పెళ్లి ధృవీకరణ పత్రాలు, లైసెన్సలు, పాన్ కార్డులు, విద్యుత్ మీటర్లు, పింఛన్లు మంజూరు, చేయూత, ఆసరా, జగనన్న తోడు, ఆరోగ్యశ్రీ కార్డు, కరెంటు, అడంగల్, ఇలా ఏది కావాలన్నా గతంలో వివిధ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేది. జన్మభూమి కమిటీలంటూ వాళ్ల చుట్టూ తిరిగాల్సి వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామ సచివాలయ వ్యవస్థతో ఇంటి వద్దకే పాలన అనే నినాదం నిజమైంది. రాష్ట్ర వ్యాప్తంగా సచివాలయాలు ఏర్పాటు చేయాలంటే వేల కోట్లతో కూడుకున్న ప్రాజెక్ట్. అందులో ఉద్యోగులను నియమించటం, ఫర్నీచర్‌ను ఏర్పాటు చేయటం తలకు మించిన భారం. అయినప్పటికి సచివాలయాలను పూర్తి వినియోగంలోకి తీసుకువచ్చి, ప్రజల మన్ననలు పొందారు.

చేబ్రోలు మండలంలో సచివాలయ సేవలు ఇలా..

గ్రామ సచివాలయాల సంఖ్య	– 17
మండలంలో వైఎస్సార్ పెన్షన్ కానుక లబ్ధిదారులు	– 9,925
జగనన్న అమ్మ ఒడి లబ్ధిదారులు	– 6,930
జగనన్న విద్యా దీవెన	– 1,311
జగనన్న వసతి దీవెన	– 1,299
వైఎస్సార్ వాహన మిత్ర	– 425
వైఎస్సార్ చేయూత	– 4,053
వైఎస్సార్ కాపు నేస్తం	– 852
జగనన్న చేదోడు	– 240
వైఎస్సార్ నేతన్న నేస్తం	– 105
జగనన్న తోడు	– 1418
వైఎస్సార్ బీమా	–153
వైఎస్సార్ ఆసరా	–13,746
వైఎస్సార్ సున్నా వడ్డీ	–13,746
రైతు భరోసా	–9,840
వైఎస్సార్ ఆరోగ్య శ్రీ	–528
ఈబీసీ నేస్తం	803

కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ తప్పింది



సర్టిఫికెట్ల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే శ్రమ ప్రస్తుతం తప్పింది. సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే త్వరితగతిన ఇస్తున్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల పేరుతో పచ్చచొక్కాల వారికే అన్ని పథకాలు ఇచ్చేవారు. సచివాలయ వ్యవస్థ ఏర్పాటుతో కులం, మతం, పార్టీల భేదం లేకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాలు అందుతున్నాయి.

–షేక్ జానీ సాహెబ్, వడ్లమూడి, చేబ్రోలు మండలం

సచివాలయ వ్యవస్థతో పాలనలో పెనుమార్పులు



ప్రజల ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. గ్రామ సచివాలయం పరిపాలన వ్యవస్థలో పెను మార్పులు తీసుకువచ్చింది. కాలయాపన లేకుండా త్వరితగతిన అన్ని సేవలు అందుతున్నాయి. అన్ని రకాల పనులు తీరుతున్నాయి.

– వైపీఏ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి

ఎంఈవో–2 పోస్టులు భర్తీ

ప్రత్తిపాడు: నియోజకవర్గంలోని రెండు మండలాలకు ఎంఈవో–2 పోస్టులను భర్తీ చేశారు. ప్రత్తిపాడు మండలానికి ఎంఈవో–2గా పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం, కారుచోల హెచ్‌ఎం గరికపాటి లీలారాణి, వట్టిచెరుకూరు మండలానికి పల్నాడు జిల్లా, పిడుగురాళ్ల మండలం, కరాలపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం డి.నిర్మలను నియమించినట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్ రమాదేవి తెలిపారు. ఎంఈవో–2 పోస్టుల్లో జిల్లా పరిషత్ యాజమాన్యంలో పనిచేస్తున్న గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులను నియమించారు.

సకాలంలో నిత్యావసరాలు పంపిణీ చేయాలి

కాకుమాను: రేషన్ షాపు డీలర్లు సకాలంలో సక్రమంగా లబ్ధిదారులందరికీ నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని తహసీల్దారు జె.ప్రసాదరావు అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఆదివారం రేషన్ షాపు డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. డీలర్లకు సూచించిన తేదీలోపు ప్రతి ఇటికీ నిత్యావసరాలు అందించాలని ఆయన తెలిపారు. పంపిణీ విషయంలో ఎలాంటి అవకతవకలకు పాల్పడినా డీలరుపై తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో కార్యాలయం సిబ్బంది, డీలర్లు పాల్గొన్నారు.

నలుగురు జూదరుల అరెస్ట్

పెదనందిపాడు: గ్రామంలో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. ఆదివారం పమిడివారిపాలెం గ్రామంలో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. వారి నుంచి రూ.3,300లు నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సోమవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నడింపాలెంలో శుద్ధజలం సరఫరాకు చర్యలు



చెరువు వద్ద ముళ్ల కంచె ఏర్పాటు చేస్తున్న సిబ్బంది



మైక్రో వాటర్ ఫిల్టర్ మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: నడింపాలెం పంచాయతీలో శుద్ధజలాన్ని సరఫరా చేసేందుకు ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు సంయుక్తంగా చర్యలు చేపట్టారు. నడింపాలెం పంచాయతీ పరిధిలోని చిన కోండ్రుపాడులో పంచాయతీ ట్యాప్‌లనుంచి సరఫరా చేస్తున్న మంచి నీరు పచ్చగా ఉంటుందని, అధికారులెవ్వరూ పట్టించుకోవడం లేదంటూ ఈ నెల 12న 'సాక్షి'లో ప్రచురితమైన 'అధికారుల నిర్లక్ష్యం –ప్రజలకు గరళం'శీర్షికపై ఐదురోజుల కిందట ఎంపీడీఓ శ్రీరమ్య సీరియస్‌గా స్పందించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వినీల్, పంచాయతీ కార్యదర్శి శుద్ధజలం సరఫరాకు నడుం బిగించారు. మైక్రో ఫిల్టర్‌కు మరమ్మతులు చేపట్టారు. అనంతరం ఫిల్టర్ బెడ్లను శుభ్రం చేయించారు. చెరువులో నీరు అడుగుకు చేరడంతో గేదెలు దిగి కలుషితం చేయకుండా ఫెన్సింగ్ లేని ప్రదేశాల్లో ముళ్ల కంచెలు ఏర్పాటు చేశారు. అంతేకాకుండా పశువుల కాపరులకు తెలిసేలా మంచినీటి చెరువు వద్ద మైకులను అమర్చి 'గేదెలను చెరువులోనికి దించవద్దు' అంటూ ప్రచారం అనౌన్స్‌మెంట్ చేస్తున్నారు. ఫిల్టర్, క్లోరినేషన్ చేసి గ్రామంలోనికి నీటిని సరఫరా చేస్తున్నామని ఏఈ వినీల్ తెలిపారు.



శుద్ధిచేసిన తరువాత బాటిల్స్‌లో నింపిన నీరు

జూద స్థావరాలపై పోలీసుల దాడులు

వేర్వేరు ప్రదేశాల్లో 12 మంది అరెస్టు

ప్రత్తిపాడు: రెండు గ్రామాల్లోని రహస్య జూద స్థావరాలపై పోలీసులు మెరుపు దాడులు చేసి, పన్నెండు మంది జూదరులను అరెస్టు చేశారు. ప్రత్తిపాడు ఎస్ఐ డి.రవీంద్రబాబు వివరాల మేరకు.. పెద గొట్టిపాడులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం స్పెషల్ బ్రాంచ్ తో పాటు ఎస్ఐకు సమాచారం అందింది. దీంతో ఎస్ఐ తన సిబ్బందితో కలిసి దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొన్నారు. వారి నుంచి రూ.15,010 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్తిపాడు శివారులో..

ప్రత్తిపాడులోని శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో ఎస్ఐ రవీంద్రబాబు జూద స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,830 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రవీంద్ర బాబు తెలిపారు.



అరెస్టు చేసిన జూదరులతో ఎస్ఐ డి.రవీంద్రబాబు

వైఎస్సార్ సీపీతోనే ముస్లింల అభివృద్ధి

కొండపాటూరు(కాకుమాను): వైఎస్సార్ సీపీతోనే రాష్ట్రంలో ముస్లింల అభివృద్ధి సాధ్యమని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని అన్నారు. కొండపాటూరులో ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు, వైఎస్సార్ సీపీ ముస్లిం, మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఖాదర్‌బాషా పిలుపు మేరకు హర్‌దిల్ మే వైఎస్సార్ హమ్ జగన్‌కు సాథ్ అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ దివంగత నేత డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించారని గుర్తుచేశారు. ఆ మహా నేత తనయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కేబినెట్‌లో, నామినేటెడ్ పదవుల్లో ముస్లింలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని ముస్లిం, మైనార్టీలందరూ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరిముల్లా పాల్గొన్నారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలాని

బారికేడ్లు ఏర్పాటు

గుంటూరు రూరల్: ప్రయాణికుల రక్షణ, ప్రమాదాల నివారణకు సౌత్‌జోన్ డీఎస్పీ మహబూబ్‌బాషా, నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంబీటీస్ కళాశాల సెంటర్‌లో బారికేడ్లను ఏర్పాటు చేయటం జరిగిందని ఎస్ఐ నరహరి తెలిపారు. ఆదివారం బారికేడ్లను ఏర్పాటు చేసి, వాహనాలను తనిఖీ నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ కాలేజ్ సెంటర్‌లో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, దీనికి తోడు ఎక్కువగా కళాశాలల విద్యార్థులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. వాటిని అరికట్టేందుకు బీఎస్ఆర్ జ్యూయలర్స్ అందించిన సుమారు 12 బారికేడ్లను వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ప్రయాణికులు గమనించి జాగ్రత్తగా ప్రయాణించాలని తెలిపారు.



బారికేడ్లను ఏర్పాటు చేసిన ఎస్ఐ నరహరి, సిబ్బంది

ప్రజలకు మెరుగైన సేవలు అందించండి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

ప్రత్తిపాడు: ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత అన్నారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో నియోజకవర్గానికి పలువురు అధికారులు వచ్చారు. బదిలీపై వచ్చిన వట్టిచెరుకూరు ఎంపీడీవో గాజుల శేషగిరిరావు, ప్రత్తిపాడు తహసీల్దార్ గుమ్మడి సిద్దార్థ, కాకుమాను ఎంపీడీఓ పోకూరి రామకృష్ణ, ఈవోపీఆర్డీ కావూరు జవహర్‌లాల్ నెహ్రూ, వట్టిచెరుకూరు ఈవోపీఆర్డీ తలపల పార్వతీ గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో ఆదివారం రాత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సుచరిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి వర్తించేలా చూడాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉండాలని సూచించారు.



ఎమ్మెల్యే సుచరితకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ప్రత్తిపాడు తహసీల్దారు సిద్దార్థ

పంచాయతీల్లో తనిఖీలు 'తనఖా'

- పత్తాలేని ఈవోపీఆర్డీల తనిఖీలు
- ఫిర్యాదులొచ్చినప్పుడే హడావుడి
- గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం

ప్రత్తిపాడు: అభివృద్ధికి పట్టుగొమ్మలైన పంచాయతీల్లో చిక్కిందే అనువుగా కొందరు సర్పంచ్‌లు, అధికారులు కలిసి రూ.లక్షలు బొక్కేస్తున్నారు. బాపూజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య నినాదాన్ని నీరుగార్చుతూ నిధులను స్వాహా చేస్తున్నారు. పంచాయతీల్లో తనిఖీలు చేయాల్సిన ఈవోపీఆర్డీలు పూర్తిగా వారి బాధ్యతలను విస్మరిస్తున్నారు. కేవలం ఫిర్యాదులొచ్చినప్పుడు తనిఖీలు చేసి, చేతులు దులిపేసుకుంటున్నారు. ఫలితంగా నిధులు దుర్వినియోగమవుతున్నాయి. పర్యవేక్షణ లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శులు కూడా ఇష్టారాజ్యంగా విధులను నిర్వర్తిస్తున్నారు.

మచ్చుకు నిధులు, ఇంటి పన్నుల దుర్వినియోగం ఘటనలు కొన్ని..

- వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు పంచాయతీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి సుమారు రూ. 20 లక్షల వరకు నిధులు దుర్వినియోగమైనట్లు నిర్ధారించి సెక్రటరీని సస్పెండ్ చేసి, సర్పంచ్ చెక్ పవర్‌ను రద్దు చేశారు.
- తాజాగా ప్రత్తిపాడు మండలంలోని పెదగొట్టిపాడు పంచాయతీలో జరిగిన అవకతవకలపై ఉప సర్పంచ్ చేసిన ఫిర్యాదుతో నిధుల దుర్వినియోగం బయటకొచ్చింది. ఏకంగా ముగ్గురు సెక్రటరీలను సస్పెండ్ చేయడంతో పాటు సర్పంచ్ చెక్ పవర్‌ను తాత్కాలికంగా నిలిపివేశారు.
- కొద్ది నెలల కిందట నియోజకవర్గంలోని ఓ మేజర్ పంచాయతీ కార్యదర్శి ఏకంగా పంచాయతీ రికార్డుల్లో ఉన్న ఆర్టీసీ బస్టాండు పేరును తొలగించి, ఒక ట్రస్ట్ పేరుకు మార్చేశాడు. ఈ విషయమై ఆర్టీసీ డిపో మేనేజర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేయడంతో పంచాయతీ ఉన్నతాధికారులు, అధికారులు శాఖా పరమైన విచారణ చేసి, సైలెంట్‌గా మరలా రికార్డుల్లోకి ఆర్టీసీ బస్టాండు పేరును చేర్చి ఫైల్ క్లోజ్ చేశారు. ఈ విషయంలో పెద్ద ఎత్తున నోట్ల కట్టలు చేతులు మారినట్లు ఆరోపణలు లేకపోలేదు. ఎవరిపైనా ఎలాంటి చర్యలు తీసుకోలేదు.
- పుసులూరులో గత ఇంటి పన్ను వసూళ్లలో అవకతవకలకు పాల్పడిన ఒక సెక్రటరీని సస్పెండ్ చేశారు.
- కొలకలూరు పంచాయతీలోనూ నిధులు దుర్వినియోగం అవ్వడంతో అక్కడి సెక్రటరీని సస్పెండ్ చేసేందుకు ఆ శాఖ కమిషనర్‌కు కలెక్టర్ సిఫారసు చేశారు.
- గతంలో నంబూరు పంచాయతీలోనూ నిధుల దుర్వినియోగం, రాయపూడి పంచాయతీలో ఇంటి పన్ను వసూళ్లలో అవకతవకలు జరిగిన ఆరోపణలు ఉన్నాయి.



గొట్టిపాడు పంచాయతీలో విచారణ సందర్భంగా ఫిర్యాదు దారులతో మాట్లాడుతున్న డీఎల్‌పీవో లక్ష్మణరావు (ఫైల్)

ఈవోపీఆర్డీల తనిఖీలు ఏమైనట్లు..

అసలు పంచాయతీల్లో జరుగుతున్న లోపాలను పసిగట్టి బయటపెట్టాల్సిన ఈఓపీఆర్డీలు వారి విధులకు పూర్తిగా మంగళం పాడేశారు. అక్రమాలు, అవకతవకలపై ప్రజలు ఫిర్యాదు చేసే వరకు తనిఖీల ఊసే ఎత్తడం లేదు. ప్రతి ఈవోపీఆర్డీ కచ్చితంగా నెలలో ఒక్కసారైనా వారి పరిధిలోని పంచాయతీలను తనిఖీ చేయాల్సి ఉంటుంది. గ్రామ సభలు, పంచాయతీ సమావేశాల నిర్వహణ? తీర్మానాలు? వాటి అమలు? ఏ పద్దు కింద ఎంత ఖర్చు పెట్టారు? నిబంధనల మేర ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయా? నిధులు దుర్వినియోగం అవుతున్నాయా? అన్నది.. ఈవోపీఆర్డీలు స్వయంగా పంచాయతీలకు వెళ్లి తనిఖీలు చేయాల్సి ఉంటుంది. కానీ తనిఖీలు చేసిన పాపాన పోలేదు. తప్పనిసరిగా తనిఖీలు చేయాల్సిన సమయంలో ముందస్తుగానే కార్యదర్శులకు సమాచారం అందించి అంతర్గత ఒప్పందాలతో తనిఖీలకు వెళుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్తిపాడు మండలంలో అయితే ఈవోపీఆర్డీ విధుల్లో చేరి దాదాపుగా పది నెలలు కావస్తున్నా ఇప్పటివరకు పట్టుమని ఐదారు పంచాయతీల్లో కూడా తనిఖీలు చేసిన దాఖలాల్లేవు.

టూర్ డైరీలున్నట్లా లేనట్లా..?

ప్రతి ఈవోపీఆర్డీ కచ్చితంగా టూర్ డైరీలు నిర్వహించాల్సి ఉంది. వాస్తవానికి ఈవోపీఆర్డీ ఏ నెల, ఏ తేదీన, ఏ గ్రామాన్ని తనిఖీ చేయాలి.. అన్న విషయాన్ని ముందస్తుగా టూర్ డైరీ ద్వారా డీఎల్‌పీవో నుంచి అనుమతి తీసుకోవాలి. కానీ అసలు ఆ టూర్ డైరీలు ఉన్నాయా? ఉంటే ఎవ్వరి వద్ద ఉంటున్నాయి? టూర్ డైరీ ప్రకారం తనిఖీలు జరుగుతున్నాయా? వంటి విషయాలు దేవుడికే ఎరుక. పర్యవేక్షించాల్సి డీఎల్‌పీవో, డీపీవోలు సైతం మౌనవ్రతం పాటిస్తున్నారు. ఇక టూర్ డైరీల సంగతి అటుంచితే మండలంలో ఈవోపీఆర్డీలు కనిపించడమే చుట్టపు చూపుగా మారింది. ప్రశ్నించాల్సిన అధికారులు మౌనం దాల్చుతున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే ఆన్‌డ్యూటీలో జిల్లా ఉన్నతాధికారుల కార్యాలయాలకు వెళ్లామని చెబుతూ.. పబ్బం గడుపుకుంటున్నారు.

మూడు నెలలకోసారి తనిఖీ చేయాల్సిందే

ఈవోపీఆర్డీలు కచ్చితంగా మూడు నెలలకోసారి ప్రతి పంచాయతీలోనూ తనిఖీలు చేయాల్సిందే. పంచాయతీ నిధుల వినియోగంపై పరిశీలన చేయాలి. తనిఖీలు చేయాలని పదేపదే ఆదేశాలిస్తున్నాం. కొందరు చేస్తున్నారు. మరికొందరు చేయడం లేదు. ఈవోపీఆర్డీలు మా కార్యాలయాలకు వచ్చేది నెలలో ఒకటి, రెండు సార్లు మాత్రమే.

– లక్ష్మణరావు, డీఎల్‌పీవో

రోటరీ క్లబ్ సేవలు అభినందనీయం

పెదకాకాని: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ సేవలు అభినందనీయమని మాజీ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.శివన్నారాయణ అన్నారు. గుంటూరు గీతా రీజెన్సీలో రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ 2022–23 అవార్డ్స్ కార్యక్రమం జరిగింది. సమావేశం అనంతరం క్లబ్ సభ్యులు రవిలిశెట్టి వేణుగోపాలరావు, పద్మజ సహకారంతో దివ్యాంగ పండ్ల వ్యాపారికి తోపుడు బండిని అందజేశారు. వడ్లవల్లి సతీష్ బాబు, విజయలక్ష్మి అక్షర వృద్ధాశ్రమానికి టీవీని బహూకరించారు. కాలిగ్రఫీ బుక్స్‌కి శివన్నారాయణ, క్లబ్ డైరెక్టర్ పి.ఆదిశేషులు రూ.25 వేలు చెక్ ను ఉపాధ్యాయులకు అందజేశారు. క్లబ్ లో విశేష సేవలందించిన సభ్యులను ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో క్లబ్ ప్రెసిడెంట్ విమలకుమారి, సెక్రటరీ పద్మజ, ట్రెజరర్ మమత, ట్రైనర్ వెంకటరమణ, డైరెక్టర్లు వైపీ చౌదరి, డాక్టర్ సుధాకర్, చావలి గణపతి, ప్రేమ్‌కుమార్, కృష్ణమోహన్, ఆదిశేషు, మద్ది రాధాకృష్ణ, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



తోపుడు బండి అందజేస్తున్న రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ సభ్యులు